క్లుప్తంగా

కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వండి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు

రేగిడి: జిల్లాలో అర్హులైన ప్రతీ కౌలురైతుకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు, జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై మండలంలోని సంకిలి గ్రామంలో విలేకరులతో సోమవారం మాట్లాడిన వారు.. జిల్లాలో 2 లక్షలకు పైగా కౌలురైతులు ఉన్నారని, వారికి పంట రుణాలు, ఎరువులు, పురుగుమందులు రాయితీపై ఇచ్చి, ఆదుకోవాలని కోరారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం


ఇసుక విక్రయాలను ప్రారంభిస్తున్న ఆర్‌డీవో సాయిశ్రీ

బొబ్బిలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఇసుక విక్రయాలను ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన ఇసుక పాలసీ ప్రకారం అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. మండలంలోని అలజంగి గ్రామంలో ప్రభుత్వ ప్రకటన రాకముందే ఇసుక విక్రయాలకు సంబంధించి, వేలంపాట నిర్వహించి, ట్రాక్టర్‌కు రూ.100 నుంచి రూ.200 వసూలు చేసినట్లు పలువురు చెబుతున్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

వంగర: రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వై.వి.జనార్దన్ హెచ్చరించారు. మండల పరిధిలోని అరసాడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు సోమవారం చేపట్టారు. వాహనదారుల లైసెన్స్, వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. అక్రమంగా మద్యం, మాదకద్రవ్యాలు తరలించే వారిని గుర్తించి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. వాహనదారులు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, అన్నిరకాల ధ్రువ పత్రాలను వెంట తీసుకురావాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

'స్టాప్ డయేరియా'

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో స్టాప్ డయేరియా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మెంతిపేట ఎస్సీ కాలనీ, బుచ్చింపేట, ఇందిరమ్మ కాలనీల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అలాగే డయేరియా(అతిసారం) బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు. అనంతరం మురుగుకాలువలు, తాగునీటి బోర్ల వద్ద బ్లీచింగ్ చల్లారు.

రూ.23కే కిలో పశుగ్రాస విత్తనాలు

రాజాం సిటీ: అన్ని పశువైద్య కేంద్రాలతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశు సంవర్ధక శాఖ ఏడీ బి.జయప్రకాష్ సోమవారం తెలిపారు. రాజాం మండలానికి సంబంధించి 500 కేజీల జొన్న పశుగ్రాసం విత్తనాలు వచ్చాయని, కిలో రూ. 92 విలువైన ఈ విత్తనాలను 75 శాతం రాయితీపై రూ.23కే అందించనున్నామన్నారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుష్యం నుంచి కాపాడండి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో నెలకొల్పిన పరిశ్రమల ద్వారా వెలువడుతున్న కాలుష్యం నుంచి తమను కాపాడాలని ఎం.బూర్జివలస గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై ఆ గ్రామ సర్పంచ్ ఈశ్వరరావు, ఎంపీటీసీ జి.లక్ష్మిలు పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిని సోమవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. అక్కడి పరిశ్రమల నుంచి భారీ ఎత్తున విడుదలవుతున్న వ్యర్థాల కారణంగా గాలి, నీరు విపరీతంగా కాలుష్యమవుతున్నాయని, దీంతో తామంతా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని వాపోయారు. గత కొన్నేళ్లుగా ఎంతోమంది చర్మ సంబంధిత వ్యాధులు, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నివారణ చర్యలు తీసుకునేలా చొరవ చూపాలన్నారు.

మడ్డువలస పిల్లకాలువల్లో ఉపాధి పనులు

రేగిడి: మండలంలోని అంబఖండి, వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లోని మడ్డువలస రిజర్వాయర్ పిల్లకాలువల్లో ఉపాధి పనులు చేపట్టారు. కాలువల ద్వారా పొలాలకు సాఫీగా సాగునీరు వెళ్లేలా కాలువలో పూడికలు తీసి, గట్లు సరిచేశారు. ఖరీఫ్‌కు ఇబ్బంది లేకుండా చేస్తున్నామని ఏపీవో హరనాథరావు తెలిపారు.

నిను మరువం రాజన్నా..!


బొబ్బిలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నిను మరువం రాజన్నా అంటూ జోహార్ వైఎస్సార్, వైఎస్సార్ అమర్ రహే అని నినాదాలు చేశారు. అనంతరం ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిస్తూ సుపరిపాలన అందించిన మహానేత.. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, జలయజ్ఞం పేరిట సాగునీటి ప్రాజెక్టులు అందించిన రైతు బాంధవుడు.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దరిచేర్చిన విద్యాదాత.. ఆరోగ్యశ్రీతో నిరుపేదలకు పునర్జన్మ ప్రసాదించిన ప్రాణదాత వైఎస్సార్ అని కొనియాడారు. పలుచోట్ల పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, అభిమానం చాటుకున్నారు. – బొబ్బిలి, రాజాం


రాజాం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తదితరులు


రామభద్రపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు


రామభద్రపురం: ఆరికతోటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమయ్య, శేఖర్ తదితరులు


తెర్లాంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు


బాడంగి: మండల కేంద్రంలో జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న నాయకులు


బాడంగి: కోడూరులో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు


బొబ్బిలి: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి తదితరులు


బాడంగి: ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


రాజాం: ఆదర్శనగర్‌లో వైఎస్సార్ అమర్ రహే అని నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


రాజాం: మారేడుబాకలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్ తదితరులు


బొబ్బిలి రూరల్: పారాదిలో వైఎస్సార్ జయంతి నిర్వహిస్తున్న గ్రామస్తులు


రేగిడి: ఏవీపురంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళలర్పిస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ, తదితరులు


సంతకవిటి: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, తదితరులు


వంగరలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శనరావు, ఎంపీపీ సురేష్‌ముఖర్జీ


వంగర: రుషింగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తు సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు


రాజాం: మొగిలివలసలో వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో ఎంపీటీసీ కాంతారావు, హరినాథ తదితరులు


సంతకవిటి: షాటీపేటలో వైఎస్సార్ జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్యసేవలందిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోనే సమస్యలు విన్నవించుకోవాలి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి

తెర్లాం: మండలానికి సంబంధించిన ప్రజాసమస్యలను ప్రతీ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్)లోనే తెలియజేయాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. ఇదే విషయమై ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. రెవెన్యూ సమస్యలు గానీ, ఇతర సమస్యలపై గానీ మండల ప్రజలు ఇకనుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లి, వినతిపత్రాలు అందజేయాల్సిన అవసరంలేదన్నారు. మండల కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌లోనే తొలుత వినతి పత్రాలు ఇవ్వాలని, ఇక్కడ సమస్య పరిష్కారం కాకపోతే బొబ్బిలి ఆర్‌డీవో ఆధ్వర్యంలో జరిగే గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లి, వినతిపత్రం ఇవ్వాలన్నారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకుంటే అప్పుడు జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లి, తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు.


రామభద్రపురం: వీఆర్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు ఇచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం కాకుంటేనే కలెక్టర్ వరకు వెళ్లాల్సి ఉంటుందని తహసీల్దార్ సులోచనరాణి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో సోమవారం సమావేశమైన ఆమె.. ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయిలోని సమస్యలు మండల స్థాయి అధికారులు పరిష్కారం చేయలేకపోతేనే ఆర్‌డీవో, ఆ తర్వాత కలెక్టర్ దగ్గరకు సమస్య పరిష్కారానికి వెళ్లాల్సి ఉంటుందన్న విషయం తెలియజేయాలన్నారు.


తెర్లాం: వినతిపత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

ఆయుర్వేద వైద్యం వినియోగించుకోండి


ఆరోగ్య సూచనలిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యసేవలను వినియోగించుకోవాలని ఖండ్యాం ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచే ఆరోగ్యానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. వర్షాల కారణంగా తలెత్తే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండాలన్నారు. కాచి,చల్లార్చిన నీటిని తాగాలని, భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం


విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

రామభద్రపురం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా స్టూడెంట్ కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు కూడా భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు చేరుకోవాలనే లక్ష్యంతో చదవాలన్నారు. అనంతరం పెద్దగెడ్డ సాగునీటి కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో మోహనరావు, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, ఎంపీటీసీలు మడక తిరుపతిరావు, వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్రరావు, ఎంఈవో తిరుమలరావు, ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

- డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు

రాజాం సిటీ: వర్షాకాలంలో తలెత్తే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీలో అర్బన్ పీహెచ్‌సీలతో పాటు నియోజకవర్గంలోని బొద్దాం, పొగిరి, బూరాడ, రేగిడి, వంగర, సంతకవిటి, మండాకురిటి పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, అవసరమైన వారికి సకాలంలో మెరుగైన సేవలందించాలన్నారు. అవసరమైన మందులు సరిపడినన్ని అందజేశామని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు గ్రామాల్లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని, ప్రభుత్వాస్పత్రిలో సాధారణ ప్రసవాలు జరపాలని తెలిపారు. జిల్లా మలేరియా నివారణ అధికారిణి డాక్టర్ వై.మణి పాల్గొన్నారు.


పీహెచ్‌సీల వైద్యాధికారులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో భాస్కరరావు సోమవారం సందర్శించి, పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు, మూవ్‌మెంట్ రిజిస్టర్లు పరిశీలించారు. ప్రతిరోజూ పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలను ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం విచ్చేసిన గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి సభ్యులు పౌష్టికాహారం అందజేశారు. ప్రతినెలా తనిఖీలకు వస్తున్న గర్భిణులకు తమవంతు సాయంగా ఈ ఆహారం అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ ఎం.శివప్రసాద్, జి.కృష్ణవేణి, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బేబీ నాయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

తెర్లాం: మండలంలోని కాలంరాజుపేటలో విషజ్వరాల బారినపడి బాధపడుతున్న వారిని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీ నాయన) సోమవారం సాయంత్రం పరామర్శించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లిన ఆయన జ్వరం తగ్గిందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని తాగునీటి వనరులు, వీధి కాలువలను పరిశీలించారు. సురక్షితమైన తాగునీరు గ్రామస్తులకు సరఫరా చేయాలని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో మధుసూదనరావును ఆదేశించారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు వైద్య శిబిరం కొనసాగించాలని పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్‌కు తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు, సర్పంచ్ రమణమూర్తి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్‌జేడీ భాస్కరరావు

రాజాం: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలని, అప్పుడే మారుతున్న కాలానుగుణంగా పాఠ్యాంశాల బోధన చేయగలరని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ భాస్కరరావు తెలిపారు. స్థానిక పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులోని శ్రీవత్సల హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధించి, నిర్వహిస్తున్న సపోర్టివ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఆయన సోమవారం పరిశీలించారు. వాటర్ ట్యాంకులో వచ్చిపోయే నీరు మాదిరి కొత్త సబ్జెక్ట్‌పై ప్రతీ ఉపాధ్యాయుడు పట్టు సాధించి, విద్యార్థులకు బోధించాలన్నారు. గతంలో బాగా నేర్చుకుని, ఇప్పుడు నేర్చుకోవడాన్ని పక్కనపెడితే భవిష్యత్‌లో నిరక్ష్యరాస్యులుగా మిగిలిపోతారన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఉపాధ్యాయుడు సమాజం నుంచి నిరంతరం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు, ట్రైనీ మాస్టర్లు రవిశంకర్, గురుమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

భగవద్గీతను అందరూ చదవాలి

వంగర: భగవద్గీతను అందరూ చదవాలని ఏపీ సాదు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద తెలిపారు. మండలంలోని కొప్పరవలస గ్రామంలో సోమవారం నిర్వహించిన సత్సంగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను గ్రామస్తులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీతలోని శ్లోకాల సారాంశం తెలుసుకుంటే మంచి వ్యక్తిగా ఎలా జీవించాలో అర్థమవుతుందన్నారు.

11న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వెల్లడించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల నుంచి పార్టీ నాయకులు సమావేశానికి హాజరుకావాలన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

బొబ్బిలి: కోటలో ఎమ్మెల్యే బేబి నాయనను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన.. టీడీపీ అధికారంలోకి వస్తే విజయనగరం జిల్లాలో కేన్సర్ ఆస్పత్రిని నిర్మిస్తామన్న మంత్రి లోకేష్ మాటలను ఎమ్మెల్యేకు గుర్తుచేశారు. ఈ విషయాన్ని ఆయనకు మళ్లీ గుర్తుచేయండి అని ఎమ్మెల్యేను కోరగా, ఆ విషయం ఆయన్నే అడగాలని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. కార్యక్రమంలో రామచంద్రరాజు, సుగుణాకరరావు తదితరులు ఉన్నారు.

